క్లుప్తంగా

తాగునీటి సరాఫరాకు అంతరాయం



కొత్త మోటార్‌ను బిగిస్తున్న పంప్‌హౌస్ నిర్వాహకులు

వెలుగోడు: స్థానిక పంప్‌హౌస్ నుంచి మండల ప్రజలకు తాగునీటి సరఫరాలో రెండు రోజుల పాటు అంతరాయం ఏర్పడనున్నట్లు నిర్వాహకులు ఖలీలుల్లా ఖాన్ తెలిపారు. గతంలో తెలుగుగంగ రిజర్వాయర్ గాలేరు గేట్ల సమీపం నుంచి నీటిని పంప్‌హౌస్‌కు పంపింగ్ చేసే మోటార్ నీటిలో పడి కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. ప్రస్తుతం రిజర్వాయర్‌లో నీటి సామర్థ్యం తగ్గడంతో కొత్త మోటార్ ఏర్పాటు చర్యలు గత రెండు రోజుల క్రితం ప్రారంభించామన్నారు. పూర్తవడానికి మరో రెండు రోజుల సమయం పట్టే అవకాశం ఉందని మండల, పట్టణ ప్రజలకు మంచి నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తెలియజేశారు.

వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ నాగలక్ష్మి

పాములపాడు: శ్రీశైల పాదయాత్రికుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో నిత్యం అందుబాటులో ఉండాలని వైద్యాధికారి నాగలక్ష్మి అన్నారు. మంగళవారం పాములపాడు, జూటూరు గ్రామాల్లోని కేజీ రోడ్డులో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడారు. సిబ్బంది విధుల ప్రకారం 24 గంటలు అందుబాటులో ఉండాలని చెప్పారు. పాదయాత్రికులకు ఏదైనా అత్యవసరమనిపిస్తే పీహెచ్‌సీకి తరలించాలని సూచించారు. ఏయే మందులు అందుబాటులో ఉంచారని పరిశీలించారు. ఆమె వెంట హెల్త్ ఎడ్యుకేటర్ మల్లికార్జున ఉన్నారు.

నైపుణ్య శిక్షణ కేంద్రం ఏర్పాటు



కరపత్రాలను విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత

నందికొట్కూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్కిల్ హబ్ సెంటర్ ఏర్పాటు చేస్తునట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత తెలిపారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్కిల్ హబ్ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వెబ్ డెవలపర్ అసోసియేట్ కస్టమర్ ఎగ్జిక్యూటివ్ కోర్సులకు ఉచిత శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియెట్ ఆపై చదివినవారు అర్హులన్నారు. 91548 30286 సెల్ నంబరుకు ఫోన్ చేసి రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు.

జాబ్‌మేళాలో 43 మందికి ఉద్యోగాలు



మాట్లాడుతున్న నైపుణ్యాభివృద్ధి సంస్థ సభ్యులు

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 43 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శ్రీనివాస్, అధ్యాపకులు విద్యాసాగర్ తెలిపారు. మొత్తం ఐదు కంపెనీల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించగా 104 మంది నిరుద్యోగ అభ్యర్థులు పాల్గొన్నారన్నారు. ఇందులో ప్రతిభ కనబరిచిన 43 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా ప్లేస్‌మెంట్ ఆఫీసర్ సుబ్బన్న, ఏపీఎస్ఎస్‌డీసీ మరియు సీడాప్ సిబ్బంది పాల్గొన్నారు.

21న దరఖాస్తుల పరిశీలన



మాట్లాడుతున్న కమిషనర్ రమేష్‌బాబు

ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో వెనకబడిన తరగతుల వారు (బీసీ, ఈడబ్ల్యూఎస్, కాపు) కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తులు చేసుకున్నారని, వారంతా ఈ నెల 21వ తేదీన ఉదయం 10 గంటలకు మున్సిపల్ కార్యాలయ కౌన్సిల్ హాల్‌కు రావాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రమేష్ బాబు సూచించారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ.. కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు దరఖాస్తు పత్రం, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, అకౌంట్ పాస్ పుస్తకం, మొబైల్ నంబర్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోతో హాజరు కావాలన్నారు. బ్యాంకు వారు దరఖాస్తు పత్రాలను పరిశీలిస్తారని చెప్పారు.

సామాన్య భక్తులకు ప్రాధాన్యం



మాట్లాడుతున్న ఉత్సవాల సీఎఫ్ఓ, డీసీ రామాంజనేయులు

మహానంది: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారి దర్శనార్థం వచ్చే సామాన్య భక్తులకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు ఉత్సవాల చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్, డిప్యూటీ కమిషనర్ ఎం.రామాంజనేయులు వెల్లడించారు. మహానందిలో ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తిరుమల ఘటన తర్వాత దేవదాయ శాఖ ఆలయాల్లో జరిగే ఉత్సవాలపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. దేవదాయశాఖ నిబంధనల మేరకు సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తూ వారికి సులభతరమైన దర్శన సౌకర్యం కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వాహనాల పార్కింగ్ దగ్గర ఇన్, అవుట్ మార్గాలను ఏర్పాటు చేస్తే ట్రాఫిక్ సమస్యలు ఉండవన్నారు. వేసవికాలం వస్తుండటంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. గాజులపల్లె రైల్వేస్టేషన్ నుంచి మహానందికి వచ్చే మార్గంలో వ్యవసాయ కళాశాల నుంచి మహానంది వరకు రోడ్డు అధ్వానంగా ఉందని, ప్రస్తుతానికి గ్రావెల్ అయినా వేయాలని ఆర్అండ్‌బీ శాఖ అధికారులకు విజ్ఞప్తి చేశారు. పారిశుద్ధ్య పనుల కొరకు పంచాయతీ అధికారులు సహకరించాలన్నారు.

హలో.. హలో.. హలో..!

- శ్రీశైలంలో పనిచేయని మొబైల్ సిగ్నల్
- ఇబ్బందులు పడుతున్న వినియోగదారులు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో బుధవారం నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతున్నాయి. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు తండోపతండాలుగా తరలివస్తున్నారు. ఈ నేపథ్యంలో గత వారం రోజులుగా శ్రీశైలం మండల పరిధిలో అన్ని మొబైల్ నెట్‌వర్క్స్ పనిచేయడం లేదు. దీంతో మొబైల్ వినియోగదారులు అవస్థలు పడుతున్నారు. అసలే శ్రీశైల క్షేత్రానికి అనునిత్యం వేలాది మంది భక్తులు తరలివస్తారు. అందులో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు మరింత మంది తరలివస్తారని, మొబైల్ నెట్‌వర్క్స్‌కు ఎటువంటి ఆటంకాలు లేకుండా పూర్తిస్థాయిలో వినియోగదారులకు సేవలందించాలని జిల్లా కలెక్టర్ టెలిఫోన్ ఎక్స్ఛేంజ్, ప్రైవేట్ మొబైల్ నెట్‌వర్క్ ఆపరేటర్లను ఆదేశించారు. అయినప్పటికీ అధికారులు స్పందించలేదు. దీంతో శ్రీశైలం మండలంలో నెట్‌వర్క్ సమస్యతో భక్తులు, స్థానికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. బీఎస్ఎన్ఎల్, ఎయిర్‌టెల్, జియో తదితర ప్రైవేట్ నెట్‌వర్క్స్ సైతం వినియోగదారులకు సేవలందించడం లేదు. సిగ్నల్ సమస్యతో భక్తులకు, స్థానిక ప్రజలకు సమాచార లోపం ఏర్పడుతుంది. ఎక్కడ చూసిన హలో.. హలో.. హలో..! అంటూ మొబైల్ నెట్‌వర్క్ సేవలపై భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శ్రీశైలం మండల పరిధిలో మొబైల్ నెట్‌వర్క్ సమస్య లేకుండా తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు భక్తులు కొరుతున్నారు.

మద్యం దుకాణాల బంద్ లేనట్లేనా?

- ఉత్సవ వేళల్లోనూ యాథావిధిగా నిర్వహణ
- ఆదాయమే ముఖ్యమా అంటూ విమర్శలు

మహానంది: మహానంది ఆలయంలో ఐదు రోజుల పాటు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతాయి. పలు ప్రాంతాలకు చెందిన భక్తులు లక్షలాదిగా తరలివస్తారు. అయితే ప్రతి ఏడాది మహాశివరాత్రి ఉత్సవాలు పురస్కరించుకుని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండటంతో పాటు ఆలయ పవిత్రతకు భంగం వాటిల్లకుండా మూడు రోజుల పాటు మద్యం దుకాణాలను బంద్ చేస్తారు. గాజులపల్లె, తిమ్మాపురం, బుక్కాపురం గ్రామాల్లో మూడు మద్యం షాపులు ఉన్నాయి. మూడు మద్యం దుకాణాల పరిధిలో బెల్టుషాపులు అధికంగా ఉన్నాయని సమాచారం. ప్రతి సంవత్సరం మహానందిలో జరిగే మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా మహానందిలో జరిగే రెండవ కో-ఆర్డినేషన్ సమావేశంలో వైన్‌షాపుల బంద్‌పై ఎక్సైజ్ అధికారులు అధికారికంగా ధ్రువీకరిస్తూ మరీ ఆదేశాలు జారీ చేస్తారు. అయితే తాజాగా మంగళవారం జరిగిన సమావేశంలో ఎక్సైజ్ అధికారులు మద్యం దుకాణాల బంద్‌పై ఎలాంటి ప్రకటన చేయకపోవడం వెనుక ఆంతర్యం ఏంటనేది ప్రశ్నార్థకంగా మారింది. ప్రభుత్వానికి ఆదాయం మాత్రమే అవసరమా, ఆధ్యాత్మికత అంశం పట్టదా అనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విషయంపై ఎక్సైజ్ సీఐ కృష్ణమూర్తిని వివరణ కోరగా మద్యం దుకాణాల బంద్ విషయంపై ఎక్సైజ్ సూపరింటెండెంట్ జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

అంగన్‌వాడీ సిబ్బందికి శిక్షణ



సూచనలు చేస్తున్న ఎంఈఓ ఇనాయతుల్లా



మాట్లాడుతున్న పీడీ లీలావతి

కొత్తపల్లి: బాల్య సంరక్షణ, విద్యపై అంగన్‌వాడీ టీచర్లకు జ్ఞానజ్యోతి కార్యక్రమం ద్వారా 120 రోజుల సర్టిఫికెట్ కోర్సుపై 6 రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ఎంఈఓ- 2 ఇనాయతుల్లా ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీ దశ నుంచి పిల్లలకు సక్రమంగా విద్యను అందించేలా సర్టిఫికెట్ కోర్సు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు పౌష్టికాహారం, విద్యావిధానం, పాఠశాల వాతావరణాన్ని వారికి ఎలా అలవాటు చేయాలనే విషయాలపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరమ్మ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పిల్లల అభ్యున్నతికి కృషి చేయాలి

బండిఆత్మకూరు: అంగన్‌వాడీ టీచర్లు, సూపర్‌వైజర్లు, వర్కర్లు పిల్లల అభివృద్ధికి కృషి చేయాలని ఎంఈఓలు యశోద, మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఉమెన్ డెవలప్‌మెంట్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ ప్రాజెక్టు డైరెక్టర్ లీలావతి మాట్లాడుతూ.. 3 - 8 సంవత్సరాల పిల్లలకు పునాది అభ్యాసన సామర్థ్యాలు, సమగ్ర అభివృద్ధిని మెరుగుపరచడంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు మెలకువలు నేర్పించడం జరిగిందన్నారు. సూపర్‌వైజర్లు రమాదేవి, ఉపాధ్యాయులు రాజశేఖర్, సుదర్శన్, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

క్షయను సమూలంగా నిర్మూలించాలి



అవగాహన కల్పిస్తున్న టీబీ సూపర్‌వైజర్ చెరుకు రవికుమార్

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో క్షయవ్యాధి గురించి అవగాహన సదస్సును టీబీ యూనిట్ సూపర్‌వైజర్ చెరుకు రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈనెల 17 నుంచి 24వ తేదీ వరకు జరుగుతున్న క్షయవ్యాధి నివారణ వారోత్సవాల్లో భాగంగా ఆయన మాట్లాడుతూ.. క్షయ వ్యాధి లక్షణాలను వివరించారు. రూ.3 వేలు విలువైన క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలను ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా చేస్తున్నారన్నారు. వ్యాధి నిర్ధారణ అయిన తర్వాత రోగికి ఆరు నెలల పాటు ఉచితంగా మందులు పంపిణీ చేస్తామన్నారు. క్రమం తప్పకుండా మందులతోపాటు పౌష్టికాహారం తీసుకోవడంతో వ్యాధి నయమవుతుందన్నారు. అనంతరం సంపూర్ణ సురక్ష కేంద్రం మేనేజర్ జబీబుల్లా మాట్లాడుతూ గుడ్ టచ్.. బ్యాడ్ టచ్ గురించి వివరించారు. హెచ్ఎం షహనాజ్‌ఉన్నిసా, ఉపాధ్యాయులు శంకర్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ



విద్యార్థులకు ప్యాడ్స్ పంపిణీ చేస్తున్న మండల ప్రత్యేక అధికారి పరమేశ్వరి

పగిద్యాల: మండలంలోని లక్ష్మాపురం అంచె వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షలు రాసేందుకు మండల ప్రత్యేక అధికారి, సెరికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ పరమేశ్వరి చేతుల మీదుగా రైటింగ్ ప్యాడ్‌లను పంపిణీ చేశారు. మంగళవారం పాఠశాల ప్రిన్సిపాల్ రమణమ్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో 75 మంది విద్యార్థినులకు ప్యాడ్స్, స్కేల్, జామెంట్రీ బాక్స్, తదితర సామగ్రిని అందజేశారు. పబ్లిక్ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. పరీక్షా సమయం సమీపిస్తున్నందున ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని విద్యార్థులను సిద్ధం చేయాలన్నారు. సబ్జెక్ట్ ఉపాధ్యాయులు సక్రమంగా పనిచేయకపోతే మెమోలు జారీ చేయాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. ఎంఈఓ మురళీమోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.

దాడిచేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి



బాధితుడు అశోక్‌తో కలిసి నిరసన వ్యక్తం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కొత్తపల్లి: మండలంలోని పెద్దగుమ్మడాపురం గ్రామానికి చెందిన దళిత (మాదిగ) యువకుడిపై దాడిచేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు కె.నాగరాజు, బి.బాలయేసు, ఎన్.ప్రేమ్‌రాజ్, ఎస్.విజ్జి డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక పోలీసుస్టేషన్ ఎదుట బాధితుడితో కలిసి నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ.. పెద్దగుమ్మడాపురం గ్రామానికి చెందిన మాదిగ అశోక్ గ్రామ పొలిమేరలోని బీడు భూమిలో మేకలు మేపుకుంటుండగా జడ్డు వెంకటేశ్వరరెడ్డి అక్కడి నుంచి వెళ్లిపోమ్మని హెచ్చరించాడు. యజమాని అనుమతితోనే మేకలు మేపుతున్నాను లేరా అని చెప్పడంతో మాటా మాటా పెరిగి ఘర్షణకు దారితీసింది. వెంకటేశ్వర రెడ్డి ఆగ్రహంతో కులం పేరుతో దుర్భాషలాడుతూ ఇష్టం వచ్చినట్లు తిట్టాడని, కిందపడేసి కాళ్లతో తన్నుతూ, గొంతుపై నులుముతూ, పిడిగుద్దులతో దాడి చేయడం హేయమైన చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై కొత్తపల్లి పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోకపోతే ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామన్నారు. మండల ఎమ్మార్పీఎస్ నాయకుడు కనక నాగన్న, తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ అమలు చేయాలి

నందికొట్కూరు: సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తేనె నాగరాజు విమర్శించారు. మంగళవారం పట్టణంలోని రెవెన్యూ కార్యాలయం ఎదుట సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలంటూ కాంగ్రెస్ పార్టీ నాయకులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పడి దాదాపు తొమ్మిది నెలలు గడుస్తున్నా సూపర్ సిక్స్ పథకాల్లో ఒక్కటి కూడా అమలుచేయలేదన్నారు. కూటమి ప్రభుత్వం పేదలను ఘోరంగా మోసం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ సోమేశ్వరిదేవికి వినతిపత్రం అందజేశారు.

రుణాల రికవరీలో అలసత్వం తగదు

జూపాడుబంగ్లా: శ్రీనిధి రుణాల రికవరీలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వీఓఏలతో పాటు సీసీలపై చర్యలు తప్పవని శ్రీనిధి అసిస్టెంటు జనరల్ మేనేజర్ ఉమామహేశ్వరరావు, సీనియర్ మేనేజర్ రమేష్ తెలిపారు. మంగళవారం జూపాడుబంగ్లా వెలుగు కార్యాలయంలో సీసీలు, వీఓఏలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలవ్యాప్తంగా రూ.21.50 లక్షల శ్రీనిధి రుణాలు బకాయి ఉన్నాయని వాటిని వారంలోగా రికవరీ చేయాలని సీసీలను, వీఓఏలను ఆదేశించారు. మండలం వ్యాప్తంగా 22 వీఓఏలు శ్రీనిధి రుణాలు సక్రమంగా చెల్లించటం లేదని వాటిల్లో 8 వీఓఏలు సమస్యాత్మకంగా ఉన్నాయని తెలిపారు. రుణాల రికవరీలో బుక్‌కీపర్లు, సీసీలు అవినీతి, అక్రమాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రికవరీతో పాటు కొత్త రుణాల మంజూరు, పరిమితిని పెంచి పొదుపు మహిళలు అభివృద్ధి బాటలో నడిచేలా కృషి చేయాలని సీసీ, వీఓఏలకు సూచించారు. శ్రీనిధి మేనేజర్ మధుశేఖర్, సీసీలు, వివిధ గ్రామాల వీఓఏలు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

పాములపాడు: ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్ఐ సురేష్‌బాబు సూచించారు. ఆయన మంగళవారం ఇస్కాల గ్రామంలో ప్రజలతో సమావేశం నిర్వహించారు. సీసీ కెమెరాల ప్రాముఖ్యతను వివరించారు. మహిళలపై నేరాలు, రోడ్డు భద్రత, సైబర్ మోసాలు వంటి వాటి గురించి వివరించారు. నిందితులపై నమోదు చేసే కేసులు, తీసుకునే చర్యల గురించి హెచ్చరించారు. ఆపద సమయాల్లో 100, 112 నంబర్లకు ఫోన్ చేయాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారి గురించి, గ్రామంలో మద్యం, నాటు సారా విక్రయాల గురించి సమాచారం అందిస్తే తగిన చర్యలు తీసుకుంటామని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. పోలీసు సిబ్బంది వెంట ఉన్నారు.

ఉపాధి పనులపై 21న బహిరంగ చర్చ

పాములపాడు: ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో జరిగిన పనులపై స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఈ నెల 21న బహిరంగ చర్చా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్, ఏపీఓ విమలమ్మ తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31వ తేదీ వరకు మండలంలో జరిగిన ఉపాధి పనులపై 18వ విడత సామాజిక తనిఖీ పూర్తైన తర్వాత చర్చా కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఎంపీపీ, జెడ్పీటీసీ, అన్ని గ్రామాల ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ప్రజలు హాజరుకావాలని కోరారు. అలాగే మండలంలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సాంకేతిక సహాయకులు, క్షేత్ర సహాయకులు, మేట్లు, ఉపాధి కూలీలు, సామాజిక భద్రతా పింఛన్‌దారులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

వీధి దీపాల ఏర్పాటు

పాములపాడు: మహాశివరాత్రి పండుగ సందర్భంగా మండలంలోని ఇస్కాల గ్రామంలో సర్పంచు మౌలాలి మంగళవారం వీధి బల్బులు ఏర్పాటు చేయించారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో మహాశివరాత్రి వేడుకలు గొప్పగా నిర్వహిస్తారని తెలిపారు. పలు చోట్ల విద్యుత్ బల్బులు వెలగడం లేదని, వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తూ, మరికొన్ని చోట్ల మరమ్మతులు చేయిస్తున్నామన్నారు.

సస్యరక్షణ చర్యలు పాటించాలి

ఆత్మకూరు: రైతులు కంది, మినుము పంటల్లో సస్యరక్షణ చర్యలను పాటించాలని ఏఓ విష్ణువర్ధన్‌రెడ్డి, డీఆర్‌సీ ఏఓ హేమలత సూచించారు. ఈ మేరకు మంగళవారం ఆత్మకూరు, బాపునంతాపురం గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. కంది, మినుము పంటల్లో సస్యరక్షణ చర్యలను వివరించారు. రైతులు గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలకు వెళ్లి ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేయించుకుని ఐడీ నంబర్ పొందాలన్నారు. పంట మార్పిడి ప్రయోజనాలను తెలియజేశారు. పంట విత్తే సమయం, విత్తన రకాల ఎంపిక, యాజమాన్య పద్ధతులపై దిగుబడి ఆధారపడి ఉంటుందన్నారు. ఉద్యానవన అధికారిణి చందన, పట్టు పరిశ్రమ అధికారిణి అరుణ, వ్యవసాయ విస్తరణాధికారులు, రైతు సేవా కేంద్రం సిబ్బంది ముర్తుజావలి, రవిగౌడ్, రైతులు పాల్గొన్నారు.

ఈ-శ్రమ్ నమోదు వేగవంతం చేయండి

మిడుతూరు: ఈ- శ్రమ్ రిజిస్ట్రేషన్లు, అసంఘటిత రంగం కార్మికుల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని ఎంపీడీఓ దశరథరామయ్య గ్రామ సచివాలయ ఉద్యోగులను సూచించారు. ఆయన మంగళవారం స్థానిక కార్యాలయంలో మాట్లాడుతూ.. సన్న, చిన్న కారు రైతులు, వ్యవసాయ కూలీలు, తాపీ మేస్త్రీలు, శాంట్రీ వర్కర్స్, ఎలక్ట్రీషియన్‌లు, ఇసుక బట్టీలలో పని చేసే కూలీలు, రిక్షావారు, టైల్స్ పనిచేసే వారు, భవన నిర్మాణ కార్మికులు, టైలరింగ్, ఎంబ్రాయిడింగ్, కుమ్మరి, కమ్మరి, తోపుడు బండ్ల వారు, వీధి వ్యాపారులు, తదితర వాటిని గుర్తించి ఈ-శ్రమ్‌లో నమోదు చేయించాలన్నారు. నమోదు చేసుకున్న వారికి ప్రత్యేక గుర్తింపు కార్డు, నంబర్, యూనివర్సల్ అకౌంట్ కార్డు జారీ చేస్తారని చెప్పారు. తద్వారా ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన ప్రయోజనాలు అందుతాయని వివరించారు.

అధిక ధరకు విక్రయిస్తే లైసెన్స్ రద్దు



ఎరువుల దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న ఏఓ

వెలుగోడు: మండలంలోని ఫర్టిలైజర్ దుకాణాలను మంగళవారం ఏఓ పవన్‌కుమార్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. ఎరువులను ఎమ్మార్పీ కంటే అధిక ధరకు విక్రయిస్తే లైసెన్సు రద్దు చేస్తానని, ప్రస్తుతం వరి పంట పిలక దశ నుంచి కంకి దశలో ఉన్నందున రైతులకు ఎకరానికి ఒక బస్తా సగటున ఒక రైతుకు 5 బస్తాల వరకు మాత్రమే యూరియా ఇవ్వాలని డీలర్లకు సూచించారు. స్టాక్ రిజిస్టర్లు, సేల్ బిల్స్ రికార్డులను పరిశీలించారు. అనంతరం అబ్దుల్లాపురం గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. రైతులు భూసార పరీక్ష ఆధారిత ఎరువులు మాత్రమే వాడాలని, విచక్షణ రహితంగా ఎరువుల వాడకం వల్ల పంటలకు నష్టం కలుగుతుందన్నారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల ద్వారా సబ్సిడీలు పొందేందుకు భూమి కలిగిన ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకొని 11 అంకెల విశిష్ట సంఖ్యను పొందాలని సూచించారు. అనంతరం మోత్కూరు రైతు సేవా కేంద్రంలో రైతులకు యూరియా పంపిణీ చేశారు.

సమగ్ర సమాచారం లేకుండా సమావేశాలెందుకు?



వ్యవసాయ అధికారి షేక్షావలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయసూర్య

నందికొట్కూరు: సమగ్ర సమాచారం లేకుండా మండల సర్వసభ్య సమావేశం ఎందుకని ఎమ్మెల్యే జయసూర్య ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో.. సమగ్ర సమాచారం లేకుండా హాజరైన మండలస్థాయి అధికారులపై ఎమ్మెల్యే మండిపడ్డారు. ఆయా శాఖలకు సంబంధించి ఎలాంటి సమస్యలు లేవా? అని అధికారులను నిలదీశారు. అలాంటప్పుడు సర్వసభ్య సమావేశాలెందుకని ప్రశ్నించారు. వచ్చే సమావేశానికి పూర్తి సమాచారంతో హాజరుకావాలని లేకపోతే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. బ్రాహ్మణకొట్కూరు పీహెచ్‌సీలో వైద్యులు వేళలు పాటించకపోతే ఇతర ప్రాంతాలకు వెళ్లాలని చెప్పారు. వేసవి కాలంలో మంచినీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎంపీడీఓ సుబ్రమణ్యం శర్మ, తహసీల్దార్ శ్రీనివాసులు, ఆయా శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరి



రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ

పాములపాడు: ప్రభుత్వం నుంచి రైతులకు మంజూరయ్యే పథకాలు వర్తించాలంటే ఆంధ్రప్రదేశ్ రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు తప్పనిసరి అని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ అన్నారు. ఆయన మంగళవారం చెలిమిల్ల, పాములపాడు గ్రామాల్లో ×పొలం పిలుస్తోంది€ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి రైతు వ్యవసాయ శాఖలో వివిధ పథకాలైన అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్, పంటల బీమా, విత్తన పంపిణీ, వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు, పంట గిట్టుబాటు ధర వంటివి పొందాలంటే రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరి అనే విషయాన్ని తెలియజేయాలని అధికారులను ఆదేశించారు. ఇందుకు గ్రామ పంచాయతీల్లోని రైతు సేవా కేంద్రాలకు వెళ్లి నమోదు చేయించుకోవాలని సూచించారు. పొలం పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, ఫోన్ నంబరుతో వెళ్లాలని సూచించారు. పంటలపై పురుగు మందుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకం పెంచాలన్నారు. అనంతరం చెలిమిల్ల రైతు సేవా కేంద్రంలో రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదును పరిశీలించారు. ఆయన వెంట ఏడీఏ ఆంజనేయ, మండల వ్యవసాయాధికారి ఫణీశ్వరరెడ్డి, సిబ్బంది ఉన్నారు.

పంట మార్పిడితో అధిక దిగుబడులు

కొత్తపల్లి: రైతులు పంటమార్పిడి విధానం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని, ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ సూచించారు. మంగళవారం స్థానిక రైతుసేవా కేంద్రంలో సర్పంచ్ లక్ష్మీదేవి అధ్యక్షతన ఏఓ కె.మహేష్ ఆధ్వర్యంలో కంది పంటలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. పంటల సాగులో యాజమాన్య పద్ధతులు, తదితర వాటిని వివరించారు. ఆత్మకూరు ఏడీఏ అంజనేయ, జెడ్పీటీసీ సోమల సుధాకర్ రెడ్డి, డీటీ పెద్దన్న, తదితరులు పాల్గొన్నారు.

సేవా గుణం అలవర్చుకోవాలి



దైవ వాక్యం వినిపిస్తున్న బిషప్ గోరంట్ల జ్వాన్నేష్

జూపాడుబంగ్లా: ఆపదలో ఉన్న వారికి సహాయం చేసే గుణాన్ని ప్రతిఒక్కరూ అలవర్చుకోవాలని బిషప్ గోరంట్ల జ్వాన్నేష్ తెలిపారు. మంగళవారం మండలంలోని పారుమంచాల గ్రామంలోని ఆర్‌సీఎం చర్చిలో ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆయన మాట్లడుతూ.. దేవుడు సూచించిన సన్మార్గంలో నడుచుకుంటూ పరుల సొమ్మును ఆశించకుండా, ఇతరులను దూషించకుండా, పరాయి స్త్రీల పట్ల మర్యాదగా నడుచుకుంటూ, మద్యం, ధూమపానం వంటి వ్యసనాలకు దూరంగా ఉంటూ పాపమార్గాలను విడిచి సన్మార్గంలో నడవాలని సూచించారు. గురువులు దేవదాసు, ప్రవీణ్, మధుబాబు, ఇన్నారెడ్డి, భాస్కర్ తోట జోసెఫ్, మనోజ్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

పూరి గుడిసె దగ్ధం

రుద్రవరం: మండల పరిధిలోని ఆర్.కొత్తపల్లెలో మంగళవారం సంభవించిన అగ్ని ప్రమాదంలో ఎద్దుల ఓబన్న అనే వ్యక్తికి సంబంధించిన పూరి గుడిసె దగ్ధమైంది. వివరాల్లోకి వెళితే.. రాత్రి అందరు నిద్రించాక గుడిసె పైభాగం నుంచి మంటలు చెలరేగాయి. విద్యుత్ షార్టు సర్క్యూట్‌తో ఈ ప్రమాదం సంభవించింది. అయితే, వెంటనే ఇంటి యజమానులు గమనించి గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కలవారు పరుగున వచ్చి మంటలను ఆర్పేందుకు యత్నించారు. అయితే, క్షణాల్లో గుడిసె కాలి బూడిద అయ్యింది. ఈ ప్రమాదంలో ఇంట్లో ఉన్న వస్తు సామగ్రి, ధాన్యం వంటివన్ని కాలిపోయి కట్టు బట్టలతో మిగిలామని బాధితుడు కన్నీటి పర్యంతమయ్యాడు.విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు అక్కడికి వెళ్లి నష్టాన్ని అంచనావేశారు.

లింగ వివక్ష విడనాడాలి

జూపాడుబంగ్లా: లింగ వివక్షతను విడనాడి స్త్రీ, పురుషులు ఇద్దరూ సమానత్వంతో మెలగాలని హెచ్‌డీ సీసీ గాంధీ, సీఆర్పీలు నౌషద్, శిరీష అన్నారు. మంగళవారం తాటిపాడు గ్రామంలో భారతి గ్రామైఖ్య సంఘం అధ్వర్యంలో పొదుపు మహిళలకు లింగ వివక్షత నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అమ్మాయికి 18 ఏళ్లు, అబ్బాయికి 21 ఏళ్ల వయస్సు దాటాకే వివాహాలు చేయాలన్నారు. అలా కాదని వివాహాలు చేస్తే బాల్య వివాహాలుగా పరిగణించి చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతేకాకుండా బాల్యవివాహాలు చేయటం వల్ల బాలికల్లో ఆరోగ్య సమస్యలు ఏర్పడతాయని వివరించారు. ఆడపిల్లలను తక్కువ చేసి చూడటం, లింగనిర్ధారణ పరీక్షలు చేసి భ్రూణహత్యలకు పాల్పడటం వంటివి చట్టరీత్యా నేరమన్నారు. గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. మహిళలు పొదుపు సంఘాల ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. వీఓఏ జ్యోతి, గ్రామైఖ్య సంఘం లీడర్లు పాల్గొన్నారు.